సాక్షి ప్రకాశం

గురువారం । 10 । ఆగస్టు । 2023



ఆడపిల్లలకు సర్కారు అండ

పేదింటి ఆడపిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా నగదు చెక్కులు పంపిణీ చేశారు. - 8లో..



వారం రోజులు హర్‌ఘర్ తిరంగా

దేశవ్యాప్తంగా హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని 15వ తేదీ వరకు నిర్వహించనున్నారు. పోస్టాఫీసుల్లో జాతీయ పతాకాలు అందుబాటులో ఉంటాయి. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36/27

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పీఎం శ్రీకి 21లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

ఒంగోలు: పీఎం శ్రీ పథకానికి జిల్లాలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని డీఈవో సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. గత ఏడాది మొత్తం 41 పాఠశాలలు ఎంపిక చేశారన్నారు. వీటికి రూ.46 లక్షలు చొప్పున నిధులను కేంద్రం విడుదల చేస్తుందన్నారు. ఈ ఏడాది ఆన్‌లైన్ పోర్టల్ ఓపెన్ అయిందని, ఈనెల 21లోగా హెడ్మాస్టర్లు వివరాలను పీఎం శ్రీ పథకం కింద నిధులు పొందేందుకు దరఖాస్తు చేయాలన్నారు.

10 నుంచి డీఈడీ సెమిస్టర్ పరీక్షలు

ఒంగోలు: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ రెండో సంవత్సరం (2015–17 నుంచి 2018–2020 బ్యాచ్‌లు) ఫెయిలైన విద్యార్థులకు, 2021–23 బ్యాచ్ రెగ్యులర్ విద్యార్థులకు మూడో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 10 నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డీఈవో వీఎస్ సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు, మైనంపాడు, దర్శి, మార్కాపురం, కంభంలలో ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు వారి హాల్‌టికెట్లను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

24న ఒంగోలు జాతి పశువుల బహిరంగ వేలం

నాగులుప్పలపాడు: చదలవాడ పశు ఉత్పత్తి క్షేత్రంలో ఈ నెల 24వ తేదీ ఉదయం 11 గంటలకు ఒంగోలు జాతి పశువులకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఏడీఏ రవికుమార్ తెలిపారు. ఈ వేలంలో ఒంగోలు జాతి పాడి ఆవులు 20, ఒట్టి ఆవులు 30, ఒంగోలు జాతి పెయ్యలు 4, పెయ్యదూడలు 20, ఒంగోలు జాతి కోడెదూడలు 7 మొత్తం 81 పశువులకు వేలం పాట నిర్వహిస్తారు. పూర్తి వివరాలకు 9392901049 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

అడవి తల్లి బిడ్డల

అభ్యున్నతే లక్ష్యం

- చెంచు బిడ్డల ఉన్నత చదువుల కోసం ప్రత్యేకంగా గిరిజన యూనివర్సిటీ
- గిరిజనుల కోసం రూ.50 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి
- అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంలో మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



గిరిజనులను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

పెద్దదోర్నాల: చెంచు గిరిజనుల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిరంతరం పాటుపడుతోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని బొగ్గరపు సత్యమమ్మ కళ్యాణ మండపంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రవీంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ సమావేశానికి హాజరైన చెంచు గిరిజనులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఆదివాసీలు అనాదిగా అటవీ సంపదను కాపాడే అటవి తల్లి ముద్దుబిడ్డలని కొనియాడారు. ప్రభుత్వం గిరిజనుల అభ్యున్నతికి కట్టుబడి ఉందన్నారు. చెంచు గిరిజనుల కోసం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. చెంచుగిరిజనుల కోసం ఒక యూనివర్సిటీని ఏర్పాటు చేశారని చెప్పారు. అందులో అధిక శాతం సీట్లను చెంచు గిరిజనులకే కేటాయిస్తారన్నారు. ఈ యూనివర్సిటీ పరిధిలో 10 మెడికల్ కళాశాలలతో పాటు, ఇంజినీరింగ్ కళాశాలలు మంజూరు చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెంచు గిరిజనుల ఆరోగ్యం, విద్య పట్ల ప్రత్యేక చర్యలు తీసుకుందని మంత్రి సురేష్ పేర్కొన్నారు. గిరిజనుల కోసం మండల కేంద్రంలో సుమారు రూ.50 కోట్లతో గిరిజన సూపర్ స్పెషాలిటీ వైద్యశాల శరవేగంతో రూపుదిద్దుకుంటోందని అన్నారు. మార్కాపురంలో మెడికల్ కళాశాలతో పాటు యర్రగొండపాలెంలో రూ.26 కోట్లతో 100 పడకల వైద్యశాల, పెద్దదోర్నాలలో రూ.3 కోట్లతో మాతా శిశు ఆరోగ్య కేంద్రాలు నిర్మిస్తున్నారని చెప్పారు. దీని వల్ల నల్లమల పరిధిలోని చెంచు గిరిజనులకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు.



గిరిజన రైతులకు వ్యవసాయ మోటార్లకు సంబంధించిన పత్రాలు అందిస్తున్న మంత్రి సురేష్

గిరిజన రైతులకు చేయూత:

2008 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి అటవీ హక్కుల చట్టం ఏర్పాటు చేసి గిరిజనులు సాగు చేసుకునే భూములపై వారికే హక్కు కల్పించారని మంత్రి సురేష్ అన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఐటీడీఏ శ్రీశైలం పరిధిలోని ప్రకాశం, కర్నూలు, గుంటూరు జిల్లాలో సుమారు 3 వేల మంది రైతులకు 6 వేల ఎకరాల భూమిని పంపిణీ చేశారన్నారు. అడవుల్లో నివశిస్తున్న చెంచు కుటుంబాలకు ఈ ఏడాది ఇంటి స్థల పట్టాలు మంజూరు చేశారన్నారు. శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని జిల్లాల్లో చెంచు రైతులను వ్యవసాయంలో అభివృద్ధి మెరుగుపరిచేందుకు ఎంతో మంది లబ్ధిదారులకు తైవాన్ స్ప్రేయర్లను అందించామని చెప్పారు. రైతు భరోసా పథకంలో భాగంగా వందలాది మందికి చెంచు రైతులకు లబ్ధి జరిగిందని అన్నారు. వైఎస్సార్ చేయూత పథకంలో భాగంగా 45–60 సంవత్సరాల వయస్సు దాదాపు వెయ్యి మంది చెంచు మహిళలు లబ్ధి పొందారని అన్నారు. దీంతో పాటు అమ్మ ఒడి పథకంలో విద్యార్థులకు లబ్ధి చేకూరిందన్నారు. ఈ సందర్భంగా పలు గూడేలకు చెందిన 9 మంది చెంచు గిరిజనులకు ఒక్కొక్కరికి రూ.1.50 లక్షల విలువ చేసే మొత్తం రూ.9 లక్షల విలువైన సబ్‌మెర్సిబుల్ మోటర్లను అందజేశారు. ఈ సందర్భంగా చెంచు గిరిజనులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రవీంద్రారెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పీటీసీలు అమిరెడ్డి రామిరెడ్డి, కుడుముల మూగెన్న, ఆర్ఓఎఫ్ఆర్ కో ఆర్డినేటర్ మంతన్న, ఏపీవో ఎ.సురేష్‌కుమార్, ఆర్‌డీటీ రీజనల్ డైరక్టర్ పుష్పలత, ఈఈ కుమార్, ఎన్ఆర్‌జీయస్ ఇన్‌చార్జ్ ప్రాజెక్టు మేనేజర్ కేజీ.నాయక్, డీఈ లతా, డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీనివాసరావు, పల్నాడు జెడ్పీటీసీ మల్లుస్వామి, వీఆర్వో సంస్థ డైరక్టర్ నరసింహారావు, సర్పంచ్‌లు నాగుల కొండమ్మ, దాసరి వెంకటమ్మ, భూమని వెంకటయ్య, పులిచర్ల గురవమ్మ, టెక్నికల్ అసిస్టెంట్ లాలా అహమ్మద్, ఐటీడీఏ సిబ్బంది పాల్గొన్నారు.

అవార్డుల కోసం ప్రతిపాదనలు పంపాలి

- డీఈఓ సుబ్బారావు

ఒంగోలు అర్బన్: కేంద్ర ప్రభుత్వం ఇన్‌స్పైర్ మనక్ అవార్డులు విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలకు విద్యార్థులతో ప్రతిపాదనలు పంపాలని, అందుకు తుది గడువు ఈ నెల 31వ తేదీ అని ఆర్‌జేడీ, డీఈఓ వీఎస్ సుబ్బారావు తెలిపారు. బుధవారం స్పందన భవనంలో సైన్స్ టీచర్లకు ఓరియెంటేషన్ నిర్వహించారు. దీనిలో డీఈఓ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులను నూతన ఆవిష్కరణల దిశగా ప్రోత్సహించేలా శాస్త్ర, సాంకేతిక, విద్యా, వైజ్ఞానిక, పర్యావరణ అంశాల సమాహారంగా ప్రాజెక్టుల నివేదికలు పంపాలన్నారు. దీనిలో రిసోర్స్ పర్సన్స్ కే రాము, పీవీ రమణయ్య, అన్నపూర్ణాదేవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పక్కాగా ఒంగోలు నగర మాస్టర్ ప్లాన్

● కలెక్టర్ దినేష్‌కుమార్ సూచన



ఒంగోలు అర్బన్: ఒంగోలు నగర పాలక సంస్థకు సంబంధించిన మాస్టర్‌ప్లాన్‌ను రాబోయే 20 ఏళ్లను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా పక్కాగా రూపొందించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. బుధవారం ప్రకాశం భవనంలో ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ(ఒనుడా) సాధారణ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పంచాయతీల్లో భవన నిర్మాణాలకు ఒనుడా రూపొందించిన ప్రిస్ అప్లికేషన్ ద్వారా మాత్రమే అనుమతులు మంజూరు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఒంగోలులోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్-1 వద్ద చేపట్టిన సుందరీకరణ, వాకింగ్ ట్రాక్, జిమ్, యోగా ప్లాట్‌ఫాం పనులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఒనుడా అథారిటీ సభ్యులు, ఒనుడా సూపరింటెండెంట్, ఇంజినీర్లు, పర్యాటక శాఖ అధికారి, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఐదేళ్ల బాలుడు మృతి



మృతి చెందిన సయ్యద్ అమన్

పెద్దారవీడు: రోడ్డు దాటుతున్న ఐదేళ్ల బాలుడిని వేగంగా వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన పెద్దారవీడు మండలంలోని దేవరాజుగట్టు కాలనీ వద్ద బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. దేవరాజు గట్టు గ్రామానికి చెందిన చిన్నారి సయ్యద్ అమన్ మార్కాపురం పట్టణంలోని ప్రైవేట్ స్కూల్లో యూకేజీ చదువుతున్నాడు. సాయంత్రం తమ ఇంటి సమీపంలో స్కూల్ బస్సు దిగి రోడ్డు దాటుతున్న అమన్(5)ను మార్కాపురం వైపు నుంచి వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగారు.

ఉరేసుకుని యువకుడు మృతి

కనిగిరి రూరల్: జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన కనిగిరి మండలంలోని గుడిపాడులో బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన ఎస్‌కే ఆలీ(35)కి ఒంగోలుకు చెందిన కరిష్మాకు మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమార్తె సంతానం. మద్యానికి బానిసైన ఆలీతో భార్య గొడవపడి కుమార్తెను తీసుకుని రెండేళ్ల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆలీ తన తల్లి మౌలాబి(రెండు కళ్లు కనిపించవు) వద్ద స్వగ్రామంలోనే ఉంటున్నాడు. ఈ పరిణామాల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెందిన ఆలీ ఈ నెల 7వ తేదీన ఇంట్లో రేకుల గదిలోని ఇనుప కమ్మీకి స్ప్రింగ్ వైరుతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చూపు కోల్పోయిన తల్లి మౌలాబి అతన్ని గమనించలేదు. బుధవారం ఆమె బంధువైన యువకుడు మౌలాబీకి టిఫిన్ తెచ్చి ఇచ్చాడు. దుర్వాసన వస్తుండటంతో కిటికిలో నుంచి లోపలికి చూడగా ఆలీ ఉరికి వేలాడుతూ కనిపించాడు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోస్టల్ ఆర్డీ అవకతవకల కేసులో బీపీఎంకు రెండేళ్ల జైలు

ఒంగోలు టౌన్: ఒక మహిళ పోస్టాఫీస్‌లో రికరింగ్ డిపాజిట్ చేసిన డబ్బును సొంతానికి వాడుకున్న బ్రాంచి పోస్ట్ మాస్టర్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ జిల్లా న్యాయస్థానం తీర్పు వెలువరించింది. వివరాలు.. జేస్తాది రామారావు చీమకుర్తి మండలం రాజుపాలెం గ్రామ బ్రాంచి పోస్టు మాస్టర్‌గా 2011 నుంచి 2015 వరకు పనిచేశారు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన తానికొండ రమాదేవితోపాటుగా మరికొందరు గ్రామస్తులు పోస్టల్‌లో ఆర్డీ చేశారు. ఆ ఆర్డీ తాలుకూ రూ.32,950ను మెయిన్ బ్రాంచిలో జమ చేయకుండా సొంతానికి వాడుకున్నట్లు రామారావుపై ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆయనను ఉద్యోగం నుంచి తొలగించారు. బాధితుల ఫిర్యాదు మేరకు చీమకుర్తి పోలీసు స్టేషన్లో అప్పటి ఎస్సై నాగశివారెడ్డి కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం నిందితుడికి కోర్టు రిమాండ్ విధించింది. పోలీసులు చార్జిషీట్ వేసి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.శ్రావణ్ కుమార్ ద్వారా సాక్షులను కోర్టులో హాజరుపరిచారు. ఎస్పీ మలికా గర్గ్ మార్గదర్శకత్వంలో సమర్థవంతంగా ట్రయల్ నడిపి నిందితుడిపై నేరాన్ని రుజువు చేశారు. దీంతో స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ ఎక్సైజ్ కోర్టు జడ్జి ఆర్.వెంకటేశ్వర శర్మ నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించారు. ఈ కేసులో సరైన సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టి సమర్థవంతంగా ట్రయల్ మానిటరింగ్ చేసిన అప్పటి చీమకుర్తి ఎస్సై పి.నాగశివారెడ్డి, కోర్టు కానిస్టేబుల్ ఎం.హరికృష్ణను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

పేదింటి ఆడపిల్లలకు సర్కారు అండ

● కలెక్టర్ దినేష్‌కుమార్
● వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా నగదు రూ.4.17 కోట్లు విడుదల
● జిల్లాలో 524 మంది లబ్ధిదారుల ఖాతాల్లో జమ



లబ్ధిదారులను సన్మానిస్తున్న కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్, ఇతర ప్రజాప్రతినిధులు



లబ్ధిదారులకు చెక్ అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, పీడీసీసీబీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి తదితరులు

ఒంగోలు అర్బన్:

పేదింటి ఆడపిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా మూడో విడత నగదు జమ కార్యక్రమాన్ని తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో సమావేశం ద్వారా నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్‌తో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, నగర మేయర్ గంగాడ సుజాత, పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాదరెడ్డి పాల్గొని లబ్ధిదారులను సత్కరించి చెక్కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా మూడో విడత కింద జిల్లాలో 524 మంది లబ్ధిదారుల తల్లుల ఖాతాల్లో రూ.4.17 కోట్లు జమ చేసినట్లు పేర్కొన్నారు. మొదటి విడతలో 179 మందికి రూ.1.67 కోట్లు, రెండో విడతలో 276 మందికి రూ.2.16 కోట్లు కలిపి మొత్తం ఇప్పటి వరకు 979 మంది లబ్ధిదారులకు రూ.8.1 కోట్లు అందజేసినట్లు వివరించారు. ఈ పథకం పొందాలంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల ఆడపిల్లలకు 18 ఏళ్లు, మగ పిల్లలకు 21 ఏళ్లు నిండి, వధూవరులిద్దరూ పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఈ నిబంధనల వల్ల బాల్య వివాహాలను నియంత్రించడంతోపాటు పైచదువులు చదివేందుకు అవకాశం ఉంటుందన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా పథకం ఆడపిల్లలున్న పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. ఆడపిల్లల చదువులు మధ్యలో ఆగిపోకుండా నిబంధనలు రూపొందించిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే టీజేఆర్ మాట్లాడుతూ.. బాల్య వివాహలను నివారించేలా సీఎం వైఎస్ జగన్ ఈ పథకం రూపొందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి లక్ష్మానాయక్, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో పొగాకు ధర

● ఒంగోలు వేలం కేంద్రం-2లో అత్యధిక ధర కేజీ రూ.289



ఒంగోలు రూరల్: పొగాకు వేలం మరో నాలుగు రోజుల్లో ముగియనుందనగా ధరలు రికార్డు స్థాయిని అందుకున్నాయని టుబాకో బోర్డు డైరెక్టర్ మారెడ్డి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఒంగోలు పొగాకు వేలం కేంద్రం -2లో నాణ్యమైన పొగాకు ధర కేజీ రూ.289 పలికిందని వెల్లడించారు. మీడియం, లోగ్రేడ్ ధరలు కూడా పెరిగాయని చెప్పారు. కాగా బుధవారం వేలం కేంద్రానికి 924 బేళ్లు రాగా 890 కొనుగోలయ్యాయి. కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.269.03 పలికింది.

జిల్లా జైలును సందర్శించిన న్యాయమూర్తులు



జిల్లా జైలు ఆవరణలో న్యాయమూర్తులు

ఒంగోలు టౌన్: శిక్షణలో భాగంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని న్యాయమూర్తులు ఒంగోలులోని జిల్లా కారాగారాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులకు కారాగారం, ముద్దాయిలకు కల్పిస్తున్న సౌకార్యాల గురించి జైలర్ వి.రమేష్ వివరించారు. జిల్లా జైలులో రోజువారీ నిర్వహించే కార్యక్రమాలను తెలియజేశారు. అనంతరం ఖైదీలతో న్యాయమూర్తులు మాట్లాడుతూ.. కారాగారాంలో మౌలిక వసతులు, సంక్షేమం, ఉచిత న్యాయ సహాయంపై ఆరా తీశారు. సందర్భనలో న్యాయమూర్తులు ఒంగోలు మూడో అడిషనల్ మేజిస్ట్రేట్ వి.శిల్ప, మొబైల్ కోర్టు న్యాయమూర్తి ఎ.సలోమి, చీరాల అదనపు జిల్లా మేజిస్ట్రేట్ షేక్.నిషాద్ నాజ్, కందుకూరు ప్రిన్సిపల్ జిల్లా మేజిస్ట్రేట్ పి.పూర్ణిమాదేవి, అద్దంకి అదనపు జిల్లా మేజిస్ట్రేట్ ఎస్.శ్రావణి ప్రియదర్శిని, కందుకూరు అదనపు జిల్లా మేజిస్ట్రేట్ ఎస్.నిఖిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వారి వెంట డిప్యూటీ జైలర్లు కె.యలమందయ్య, ఎస్.మలికార్జునరెడ్డి, చీఫ్ వార్డర్ బి.శ్రీనివాసరావు ఉన్నారు.

వారం రోజులపాటు హర్ ఘర్ తిరంగా

● సీనియర్ పోస్టల్ సూపరింటెండెంట్ సురేష్
● ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని విజ్ఞప్తి

ఒంగోలు సబర్బన్: దేశ వ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని బుధవారం నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్స్(ఎస్ఎస్‌పీ) బీవీఎస్ సురేష్ తెలిపారు. బుధవారం చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తిని ఒంగోలులోని సంతపేటలో ఉన్న నివాసంలో, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర బాబును స్థానిక వీఐపీ రోడ్డులోని నివాసంలో ఎస్ఎస్‌పీ సురేష్ మర్యాదపూర్వకంగా కలిసి జాతీయ జెండా అందజేశారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం గురించి ఎమ్మెల్యేలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగురవేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆన్‌లైన్లో, అన్ని పోస్టాఫీసుల్లో రూ.25 చెల్లించి జాతీయ జెండాలు పొందాలని కోరారు.



జాతీయ జెండా ప్రదర్శిస్తున్న మంత్రి సురేష్, సూపరింటెండెంట్ శ్రీనివాస్

తిరంగాను ప్రదర్శించిన మంత్రి సురేష్

మార్కాపురం: హర్‌ఘర్ తిరంగాలో భాగంగా రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ బుధవారం మార్కాపురంలోని క్యాంపు కార్యాలయంలో డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్‌తో కలిసి జాతీయ జెండాను ప్రదర్శించారు. పోస్టాఫీసులో రూ.25 చెల్లించి జాతీయ జెండా కొనుగోలు చేసి ప్రతి ఇంటిపై ఎగరవేయాలని సూపరింటెండెంట్ కోరారు. హెడ్ పోస్టుమాస్టర్ సుబానీ, యూనియన్ నాయకుడు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





ఎమ్మెల్యే టీజేఆర్, కరణంకు జాతీయ జెండా అందిస్తున్న పోస్టల్ ఎస్ఎస్‌పీ సురేష్

ఆదివాసీల అభ్యున్నతికి కృషి

● జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు



గిరిజన విద్యార్థులతో జేసీ శ్రీనివాసులు, ఆదివాసీ ప్రతినిధులు

ఒంగోలు: ఆదివాసీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసీల దినోత్సవం సందర్భంగా స్థానిక గిరిజన భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనులు విద్యతోనే ఆర్థికంగా ఎదగగలుగుతారన్నారు. మిగిలిన వర్గాలతో పోలిస్తే ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుకోవడంలో గిరిజనులు వెనుకబాటులో ఉన్నారని, వారు ముందంజలోకి రావాలంటే విద్యతోనే సాధ్యమన్నారు. బాలింతల కోసం, తల్లుల్లో రక్తహీనత లేకుండా చూసేందుకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోందన్నారు. జగనన్న విదేశీ విద్యలో ఒక గిరిజనుడు మాత్రమే ఎంపికయ్యాడని, గిరిజనులను విద్యవైపు ప్రోత్సహించేందుకు మేధావులు, గిరిజన సంఘాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జగనన్న ఫౌండేషన్ అధ్యక్షుడు వారా వీర్రాజు మాట్లాడుతూ.. నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. అనంతరం వారా వీర్రాజు తమ సంస్థ తరఫున 200 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు అంజన, 16వ డివిజన్ కార్పొరేటర్ శ్రీరామ నాగభూషణం, ఎం.శ్రీనివాసరావు, ఏడుకొండలు, భాస్కరరావు, బుజ్జమ్మ, సైదానాయక్, పేరం సత్యం, పేరం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాత కక్షల నేపథ్యంలో ఇంటికి నిప్పు



దగ్ధమైన గృహాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ ఎస్పీ అంకిత సురానా

మార్కాపురం రూరల్: పాత కక్షలను మనసులో పెట్టుకుని ఓ గృహానికి ప్రత్యర్థి కుటుంబానికి చెందిన వారు నిప్పుపెట్టారు. ఈ సంఘటన బుధవారం సాయంత్రం మార్కాపురం మండలంలోని నాయుడుపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఓ యువతి, యువకుడు ప్రేమించుకున్నారు. 14 నెలల క్రితం పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుని కుటుంబ సభ్యులకు తెలియజేయగా ఇరు వర్గాల వారు అందుకు ఒప్పుకోలేదు. దీంతో స్నేహితులిద్దరూ పురుగు మందు తాగి రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యకు యత్నించారు. ఈ ఘటనలో యువకుడు మృతి చెందగా, యువతి జీవించి ఉంది. తదనంతర పరిణామాల నేపథ్యంలో యువతి కుటుంబ సభ్యులు గ్రామం వదిలి వెళ్లిపోయారు. అయితే యువతికి సంబంధించిన గృహాన్ని బుధవారం యువకుడి బంధువులైన కోట్ల నాగమ్మ, నాగయ్య, భాస్కర్ కలిసి దగ్ధం చేశారు. ఇంటికి నిప్పు పెడుతున్న సమయంలో యువతి బంధువులు అడ్డుపడగా వారిపైనా నిందితులు దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు పోలీసులకు నిశనం కోటేశ్వరరావు, పెద్ద అల్లూరయ్య, రామయ్య, కొండయ్య ఫిర్యాదు చేయగా.. దగ్ధమైన ఇంటిని ట్రైనీ ఎస్పీ అంకిత సురానా పరిశీలించారు.

సమాజ హితం కోరేలా ఆకాశవాణి ప్రసారాలు

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
● ఘనంగా 30వ ఆవిర్భావ వార్షికోత్సవం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

మార్కాపురం: ఆకాశవాణి ప్రసారాలు సమాజ హితం కోరతాయని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మార్కాపురం ఆకాశవాణి కేంద్రం 30వ వార్షికోత్సవాన్ని ఆకాశవాణి ప్రాంగణంలో ప్రోగ్రాం హెడ్ పి.ప్రశాంత్ కిరణ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ.. తన తండ్రి, మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి, అప్పటి ఎంపీ కాసు కృష్ణారెడ్డి కలిసి నాటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి సహకారంతో 1993 ఆగస్టు 9న మార్కాపురంలో ఆకాశవాణి కేంద్రం ప్రారంభించారని గుర్తు చేశారు. వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలో కళలను వెలికితీయడంతోపాటు కవులు, కళాకారులను ప్రోత్సహిస్తూ ఆకాశవాణి చేస్తున్న కృషిని ప్రశంసించారు. యువతకు ఉపాధి అవకాశాలు, ఉద్యోగ వివరాలు ఎప్పటికపుడు తెలియజేయాలని కోరారు. స్వయం సహాయక బృందాల విజయగాథలు, స్ఫూర్తి సంఘటనలు కూడా రేడియోలో ప్రసారం చేయాలని సూచించారు. ఆకాశవాణిలో వచ్చే వార్తలు, కరెంట్ అఫైర్స్, స్పాట్‌లైట్ ప్రోగ్రాంలు, వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి చక్కగా ఉపయోగపడతాయన్నారు. మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ మాట్లాడుతూ.. సంగీతాన్ని, సాహిత్యాన్ని నేటి తరం కవులను సమాజానికి పరిచయం చేస్తున్న ఘనత ఆకాశవాణికే దక్కుతుందన్నారు. ప్రోగ్రాం హెడ్ ప్రశాంత్ కిరణ్ మాట్లాడుతూ.. గడిచిన నాలుగైదు నెలలుగా శ్రోతల కోసం పలు నూతన కార్యక్రమాలు ప్రసారం చేస్తున్నామని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే కేపీ, చైర్మన్ బాలమురళికృష్ణను ఆకాశవాణి సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ సుభాష్, కార్యక్రమ నిర్వహణాధికారి దివ్య, ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ చుండూరు మాణిక్యరావు, సీనియర్ అనౌన్సర్ కేవీ నరసింహారావు, సాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మధుసుదన్, ఇంజినీరింగ్, ప్రోగ్రాం సిబ్బంది పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపులో నిబంధనలు పాటించాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఓటర్ల జాబితాలో తొలగింపుల ప్రక్రియ ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చేపట్టాలని కలెక్టర్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. బుధవారం ప్రకాశం భవనంలో ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై సంబంధిత అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించేటప్పుడు ఫారం-7, సంబంధిత కుటుంబానికి నోటీసు జారీ చేసే విషయాలను పాటించాలన్నారు. బీఎల్ఓల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తు ఓటర్లను గుర్తించడంలో నిబంధనల ఉల్లంఘన జరగకూడదన్నారు. ఓటర్ల జాబితా తయారీలో స్పష్టత ముఖ్యమన్నారు. చిరునామా విషయంలో జంక్ క్యారెక్టర్లు ఉన్న కేసులపై బీఎల్ఓలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ బీఎల్ఓ యాప్ స్లోగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అయితే ఈ విషయాన్ని గత వారం విశాఖలో జరిగిన సదస్సులో ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లినట్లు కలెక్టర్ తెలిపారు. త్వరలో ఈ సమస్య పరిష్కారం అవుతుందని ఈసీ అధికారులు తెలిపారన్నారు. జిల్లాలో అన్నీ నియోజకవర్గాల్లో డోర్ నంబర్ల వారీగా ఓటర్ల జాబితా పరిశీలన జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని ఓటర్ల జాబితలో లోప రహితంగా రూపొందించడంలో సహకరించాలని సూచించారు. దీనిలో మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, డీఆర్‌ఓ శ్రీలత, కనిగిరి ఆర్డీవో అజయ్ కుమార్, ఈఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, వైఎస్సార్ సీపీ నుంచి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల నుంచి కాలేషబేగ్, రాజశేఖర్, సత్యం, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

బోధనోపకరణాలను సద్వినియోగం చేసుకోవాలి

ఒంగోలు:

దివ్యాంగులకు అందించిన బోధనోపకరణాలను రోజూ కనీసం ఒకటి లేదా రెండు చొప్పున వినియోగించాలని తద్వారా మానసిక వికాసం పొందవచ్చని డీఈఓ వీఎస్ సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక సమగ్ర శిక్ష సమావేశ మందిరంలో దివ్యాంగులకు రెండో విడత 57 టీఎల్ఎం కిట్లు పంపిణీ చేశారు. నిపిడ్ సంస్థ ప్రతినిధి డాక్టర్ సునీతాదేవి మాట్లాడుతూ.. దివ్యాంగ చిన్నారులకు టీవీ, మొబైల్ ఫోన్ కాకుండా టీఎల్ఎం కిట్‌లో పరికరాలు వినియోగించేలా చూస్తే మేధో వికాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సహిత విద్య ఇన్‌చార్జి కోఆర్డినేటర్ ఎం.రమేష్, స్పెషల్ ఎడ్యుకేటర్ జగన్, రిసోర్స్‌పర్సన్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.